క్లుప్తంగా

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవో తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



కేజీహెచ్ మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న సిటు నాయకులు

డాబాగార్డెన్స్: అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని, శానిటేషన్ కాంట్రాక్టర్ దుర్మార్గపు విధానాలు విడనాడాలని, మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం మానాలని సిటు ఆధ్వర్యంలో శనివారం కేజీహెచ్ మెయిన్ గేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిటు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం రూ.16 వేలు జీతం శానిటేషన్ వర్కర్లకు ఇవ్వాలని, ఈఎస్ఐ సక్రమంగా కట్టాలని డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిటు సీనియర్ నాయకులు వై.రాజు, ఎం.సుబ్బారావు, జోన్ కార్యదర్శి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో సైన్స్ ఫెస్ట్



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న అతిథులు

కంచరపాలెం: జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో శనివారం బయోబ్లూమ్–25 ఇంటర్ సైన్స్ ఫెస్ట్‌ను ముఖ్య అతిథి, ఫిషరీష్ సైంటిస్ట్ జీవీపీ ప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. ఇటువంటి కార్యక్రమాలు సరికొత్త ఆవిష్కరణలకు దోహదపడతాయని అతిథులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ హేమ, కో–ఆర్డినేటర్ డాక్టర్ ఈ. హరిణి, పి.కె.జయలక్ష్మి, స్నేహ, రోసినా జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

సూరిబాబు పోరాటానికి దేవిశ్రీ సంఘీభావం



సూరిబాబుకు సంఘీభావం తెలియజేస్తున్న మజ్జి దేవిశ్రీ

బీచ్‌రోడ్డు: మాదకద్రవ్యాల ముఠాలపై సంఘమిత్ర సూరిబాబు చేస్తున్న పోరాటానికి ప్రజా గాయకుడు మజ్జి దేవిశ్రీ సంఘీభావం తెలిపారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మజ్జి దేవిశ్రీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల తయారు చేస్తూ సమాజాన్ని విషగుండంగా మార్చుతున్న కుటుంబాల ఆస్తులను జప్తు చేసి, జీవితాంతం జైల్లో ఉంచాలని సంఘమిత్ర సూరిబాబు చేస్తున్న పోరాటం అభినందనీయమైనదని అన్నారు. ఈ ముఠాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

మా ఇళ్ల వద్దకు వస్తే.. నిలదీస్తాం

- అబద్ధపు హామీలతో నమ్మించి మోసం చేశారు
- ఏడాది దాటినా హామీలు నెరవేర్చకుండా కహానీలు
- చంద్రబాబు మేనిఫెస్టో మోసాలపై ప్రజల ఆగ్రహం



అల్లిపురం:

నాడు సూపర్ సిక్స్ పథకాలు అని ఊదరగొట్టిన బాబోరు.. నేడు మా వల్ల కాదు పొమ్మంటున్నాడు అంటూ నియోజకవర్గం ప్రజలు చంద్రబాబు అబద్ధపు హామీలపై విరుచుకుపడుతున్నారు. అబద్ధపు హామీలతో దగా చేసి.. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా హామీలు నెరవేర్చకుండా కహానీలు చెబుతున్నారంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తుతున్నారు. కూటమి నాయకులు 'తొలి అడుగు' పేరిట తమ ఇళ్ల వద్దకు వస్తే నిలదీస్తామని స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఎన్నికల్లో చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే జగన్‌మోహన్‌రెడ్డి కంటే రెండింతలు అధికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తామంటూ ఎన్నికల్లో చంద్రబాబు ఊదరగొట్టి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, కూటమి నాయకులు ఇళ్ల వద్దకు వచ్చి వార్డులో సమస్యలు గానీ, ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ అడిగిన పాపాన పోలేదని మండిపడుతున్నారు.

నమ్మితే నట్టేట ముంచేస్తాడంతే..

చంద్రబాబును నమ్మితే నట్టేట ముంచేస్తాడని.. అది ఆయనకు వెన్నతో పెట్టిన విద్య అని నియోజకవర్గం ప్రజలు అంటున్నారు. నోటికొచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి అధికారంలోకి వచ్చాక నమ్మినవాళ్లను వంచించడం, మోసగించడం చంద్రబాబు నైజమని, మామనే నమ్మించి మోసం చేసిన ఆయన వెన్నుపోటు రాజకీయాలకు బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శిస్తున్నారు. రాజకీయాల్లో 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని తనకు తాను గొప్పలు చెప్పుకునే చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడల్లా ఇచ్చిన హామీలు నెరవేర్చరని చరిత్రే చెబుతుందని గుర్తు చేసుకుంటున్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీల ప్రకారం ఏడాది కాలంలో ఒక్కో కుటుంబం రూ.లక్ష నుంచి రూ.2.5 లక్షల వరకు నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజలను మోసం చేయడం బాబుకు కొత్త కాదు..



నమ్మిన ప్రజలను మోసం చేయడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు కొత్తకాదు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు కూడా ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికి వదిలేశారు. అదేమని అడిగితే తప్పుడు కేసులతో వారిని బాధించడం తప్ప బాబుకు మరో పని చేతకాదు. ప్రజలను గ్రాఫిక్స్ భ్రమల్లో ముంచడమే బాబు నైజం.

– తోట పద్మావతి, 34వ వార్డు కార్పొరేటర్

మోసం చేయడం బాబు నైజం



మోసం చేయడం చంద్రబాబు నైజం. అది వాస్తవం కూడా. అయినప్పటికీ ప్రజలు అతనికి ఓట్లు వేయడం వారు చేసిన తప్పు. బాబు మాటలు నమ్మి మోసపోవడం ప్రజలకు అలవాటు అయిపోయింది. ప్రజల పరిస్థితి ఇప్పుడు బంగారు గుడ్డు పెట్టే బాతును కోసుకు తిన్నట్లుగా అయిపోయింది. ఇప్పుడేం చేయలేని పరిస్థితి అయిపోయింది.

– లింగం శ్రీనివాసరావు, సీనియర్ నాయకుడు, వైఎస్సార్‌సీపీ

గ్యాస్ సబ్సిడీ అంతా గ్యాసే..



ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితమన్నారు. కానీ అదంతా ఉత్తి గ్యాసేనని ఇప్పుడు తెలిసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం పూర్తయినా ఇప్పటి వరకు లబ్ధిదారులందరికీ గ్యాస్ సబ్సిడీ కలగానే మిగిలింది. అదేమని అడిగితే సాకులు చెబుతున్నారు. టీడీపీ నాయకులు ఇంటికి వస్తే వారిని తప్పకుండా అడుగుతాం.

– వాసాది లక్ష్మి, కొబ్బరితోట

కొత్త పింఛన్ల మాటే లేదు..



కొత్త పింఛన్లు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు. గతంలో వలంటీర్లు ఇంటికి వచ్చి మా కష్టసుఖాలు అడిగేవారు. దరఖాస్తులు కూడా వారే ఇంటికి వచ్చి పట్టుకెళ్లేవారు. ఇప్పుడు అడిగేవాడే లేడు. అదిగో వస్తుంది.. ఇదిగో వస్తుంది అనడమే తప్ప వచ్చిందీ లేదు సచ్చిందీ లేదు.

– పోలిపిల్లి అప్పల నర్సమ్మ, అంబేడ్కర్ కాలనీ

ప్రతి మహిళకు రూ.1500 అన్నారు.. ఏవీ?



తాము అధికారంలోకి మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని, రూ.18 వేలు ఆర్థిక సహకారమన్నారు. ఎన్నిక ప్రచారంలో ఊదర గొట్టారు. తీరా గెలిచాక అవేవీ లేవు. ఏడాదవుతుంది.. ఇంకెప్పుడు ఇస్తారు బాబు. ఉచిత బస్సు కాస్త తుస్సు అయింది. ఇంక బాబును నమ్మే పరిస్థితి పోయింది. ఎవరైనా కూటమి నాయకులు వస్తే నిలదీస్తాం.

– సత్యాద సరస్వతి, అంబేడ్కర్ కాలనీ

ప్లాస్టిక్ నివారణతోనే మెరుగైన సమాజం



మానవహారంగా ఏర్పడిన జెడ్పీ అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని జిల్లా పరిషత్ సీఈవో కె.రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం జెడ్పీలో జరిగిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు నార, గుడ్డ సంచులను విరివిగా వినియోగించాలని సూచించారు. అనంతరం జెడ్పీ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఆర్ఈఎంఏ అధ్యక్షుడు ఎస్.సత్తిబాబు, పరిపాలనాధికారులు డి.మంజువాణి, పి.వి.వి.ఎస్.మూర్తి, వి.ఆర్.ఆర్.రాజేశ్వరి, పి.వి.వి.సతీష్, ఎం.వి.నర్సింహమూర్తి, కె.ఎస్.రంగా తదితరులు పాల్గొన్నారు.

■ జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఉప సంచాలకుడు కె. సదారావు, సహాయ సంచాలకుడు డి.రమేష్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు తొలగించారు. ప్లాస్టిక్‌కు స్వస్తి పలుకుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పీఆర్వో నారాయణరావు, ఏపీఆర్వో శ్రీనివాసరావు, ఏవీఎస్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

'దాట్ల'కు రావిశాస్త్రి పురస్కారం

సీతంపేట: రావిశాస్త్రి సాహిత్య పురస్కారాన్ని ఈ ఏడాది యానాంకు చెందిన కథా రచయిత దాట్ల దేవదానం రాజుకు ఇస్తున్నట్లు రావిశాస్త్రి ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ రాచకొండ నరసింహశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న రావిశాస్త్రి జయంతి పురస్కారం అందజేస్తామన్నారు.

నెలనెలా ప్రతిభా పోటీలు



పిల్లలచే పోస్టర్ ఆవిష్కరింపజేస్తున్న క్లబ్ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్

డాబాగార్డెన్స్: మీ ప్రతిభకు మా పురస్కారం.. సకల కళా ఉత్సవ్ పేరిట నెలకు ఒకటి చొప్పున 12 నెలలకు (2025–26) మిరాకిల్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో ప్రతిభా పోటీలు అన్ని వయస్సుల వారికి నిర్వహించనున్నట్లు క్లబ్ వ్యవస్థాపకుడు, కొరియోగ్రాఫర్ మహ్మద్ షకీల్ తెలిపారు. ఈ మేరకు సంస్థ కార్యాలయంలో విద్యార్థినులచే ఈ నెల 27న నిర్వహించనున్న ప్రతిభా పోటీల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షకీల్ కార్యక్రమ వివరాలు వెల్లడించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఆ రోజు ఉదయం 9.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకు పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. క్లాసికల్, వెస్ట్రన్ డ్యాన్స్, సింగింగ్, మ్యూజిక్ ఇన్‌స్ట్రుమెంట్స్, ఫోక్ డ్యాన్స్, గెటప్స్, డైలాగ్స్, ట్రెడిషనల్, ఫ్యాన్సీ డ్రెస్ తదితర పోటీలు ఉంటాయని, అన్ని వయసుల వారు అర్హులేనని చెప్పారు. పోటీలో పాల్గొనదలిచే వారు 9966485335 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్రమశిక్షణతోనే ఉన్నత శిఖరాలకు



కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్, క్లాస్ లీడర్ బ్యాడ్జిలతో విద్యార్థులు

డాబాగార్డెన్స్: చదవాలనే పట్టుదలతో పాటు క్రమశిక్షణ ఉంటే విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని టింపనీ పాఠశాల మాజీ డైరెక్టర్ నళిని నెల్సన్ పేర్కొన్నారు. కైట్స్ నోబుల్ పాఠశాలలో శనివారం ఇన్వెస్టిట్యూర్ కార్యక్రమం నిర్వహించారు. ఉత్తమ లక్షణాలు కలిగిన విద్యార్థులను కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్, క్లాస్ లీడర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆమె విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేశారు. పాఠశాల వ్యవస్థాపకురాలు నిరుపమ పరుచూరి మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడా, సాంస్కృతి, సాంప్రదాయాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరంగ ఫ్యాషన్ వాక్ కార్యక్రమంపై పిల్లలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కిరణ్‌కుమార్, ధనలక్ష్మి, సునీత, రవికిరణ్, ప్రధానోపాధ్యాయురాలు కనకవల్లీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ నిలిపేయాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులు, ఆదివాసీలను హతమార్చడం ఆపాలని పౌర, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ అంబేడ్కర్ విగ్రహం నుండి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు శనివారం శాంతి ర్యాలీ జరిగింది. ఇందులో పెద్ద సంఖ్యలో ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. విరసం ప్రతినిధి పినాకపాణి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని గత మూడు నెలలుగా దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్య, లౌకిక, వామపక్ష, విప్లవ శక్తులు డిమాండ్ చేస్తున్నాయని అన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఖనిజ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం 2024 జనవరి 1న ఆపరేషన్ కగార్ ప్రారంభించిందని తెలిపారు. మావోయిస్టుల ఆధ్వర్యంలో ఆదివాసీలు దీనికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని చెప్పారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న హత్యాకాండ మావోయిస్టులకు మాత్రమే సంబంధించినది కాదని, ప్రజలందరూ దీనిపై స్పందించాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ పాకిస్తాన్‌తో యుద్ధం విరమించిన కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులతో చర్చలకు రాకపోవడం దారుణమని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి జగ్గు నాయుడు, మానవ హక్కుల వేదిక ప్రతినిధి వి.ఎస్. కృష్ణ, ఎ ఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి వాసుపల్లి చేయూత



ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఓ పేద ఇంటికి వెళ్లి అక్కడ వారి కష్టాలు చూసి చలించిపోయారు. ఆ ఇంటి మహిళ ఆదారి వెంకటలక్ష్మికి రూ. 5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరెంటు చార్జీలు పెంచమని చెప్పి బిల్లుల మోత మోగించడమే కాక ఆ పేరుతో పథకాలు తొలగించడం పట్ల పేదలు ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారన్నారు. మళ్లీ ఇప్పుడు స్మార్ట్ మీటర్లు అమర్చి ప్రజల నుండి వసూలు చేయడానికి కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందని, దీనిని ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్, 33వ వార్డు ప్రెసిడెంట్ ముత్తాబత్తుల రమేష్, పచ్చిరపల్లి రాము, సౌత్ అనుబంధ సంఘాల ప్రెసిడెంట్లు వాసాల సుబ్రహ్మణ్యం (సువార్త రాజు), ఆకుల శ్యామ్, సూర్యనాయుడు, అరుగుల రాజు, రామరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ అంటే బాబుకు వణుకు

- కూటమి మేనిఫెస్టో అంతా అబద్ధమే
- మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి ధ్వజం





బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ పోస్టర్లు ప్రదర్శిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్, బొల్లవరపు జాన్‌వెస్లీ, తోట పద్మావతి తదితరులు, కార్యక్రమంలో పాల్గొన్న వార్డు ప్రజలు

అల్లిపురం: జననేత జగనన్నను ఓడించేందుకు ఒంటరిగా వచ్చే దమ్ము లేక చంద్రబాబు మూకుమ్మడిగా పార్టీలతో జతకట్టి గెలిచినప్పటికీ నిజమైన ప్రజాబలంలో వైఎస్సార్‌సీపీదే విజయమని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి ఆధ్వర్యంలో శనివారం జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో వాసుపల్లితో పాటు స్టేట్ క్రిస్టియన్ మైనారిటీ ప్రెసిడెంట్ బొల్లవరపు జాన్ వెస్లీ, జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి రామానంద్, జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ సనపల రవీంద్ర భరత్ పాల్గొని ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వాసుపల్లి మాట్లాడుతూ జగనన్న పేరు వింటేనే చంద్రబాబుకు వెన్నులో వణుకు పుడుతుందని అన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ తిరిగినా.. ఏ నోట విన్నా జగనన్న మాటే వినిపిస్తుందన్నారు. ఆయన ఇంటింటికీ ఇచ్చిన సంక్షేమ పథకాలు కూటమి ప్రభుత్వంలో పేదలకు చేరడం లేదన్నారు. జగన్ ఫొటో చూస్తేనే వణికిపోతున్న పచ్చనేతలు ఆయన పథకాలను కనుమరుగు చేశామని సంబర పడిపోతున్నారన్నారు.

కానీ త్వరలో జగనన్న ప్రభుత్వం రానున్నదని, పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ నిలబడి న్యాయ పోరాటం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎర్నిమాంబ ఆలయ చైర్మన్ లండా రమణ, నాయకులు లింగం శ్రీను, జిల్లా వాలంటరీ విభాగం ఉపాధ్యక్షుడు దూడ అప్పారావు, అది విష్ణు, బడ్డీబోయిన అప్పారావు, గరికిన వెంకటేష్, కడవల నాగమణి, అంబటి అప్పలరాజు, సీనియర్ నాయకులు గార తాత అబ్బాయి, పిల్లి సత్తిబాబు, యేసాలపు రాజు, వాసుపల్లి చిన్న, సూరాడ లక్ష్మణరావు, నగల శ్రీను, చల్ల పిల్లి సత్తిరాజు, గాలి పార్వతి, వాసుపల్లి ధనరాజు, స్టేట్ మాజీ డైరెక్టర్ రెయ్యి డేవిడ్ రాజ్, స్టేట్ ఆర్‌టీఐ సెక్రటరీ దశమంతుల చిన్ని, జిల్లా సెక్రటరీ అభిరెడ్డి ఆది విష్ణు, కార్పొరేటర్ బిపిన్ జైన్, కో ఆప్షన్ మెంబర్ షరీఫ్, పచ్చిరపల్లి రాము, వార్డు ప్రెసిడెంట్ పీతల వాసు, భీశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గోతులు పూడ్చారు..

సాక్షి ఎఫెక్ట్..



దగ్గరుండి గోతిలో కాంక్రీట్ వేయిస్తున్న కార్పొరేటర్ కందుల నాగరాజు

అల్లిపురం: 'వాహన చోదకుల అవస్థలు వర్ణనాతీతం' అని శనివారం సాక్షి దినపత్రికలో ప్రచురించిన కథనానికి జీవీఎంసీ అధికారులు, వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు స్పందించారు. తక్షణమే కాంట్రాక్టర్‌ను పిలిపించి శనివారం ఉదయం గోతులను కాంక్రీట్‌తో పూడ్చి సమస్య పరిష్కరించారు. దీంతో స్థానికులు, వాహన చోదకులు హర్షం వ్యక్తం చేశారు.

గాయపడిన వ్యక్తికి సపర్యలు



వ్యక్తికి సపర్యలు చేస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: వివేకానంద కాలనీలో తెలుగు రాని వ్యక్తి ఒకరు రక్తం కారుతూ శనివారం బాధపడుతున్న వైనం గమనించిన మానవ హక్కుల సంఘం సభ్యుడు, 33వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు పచ్చిరిపల్లి రాము అతనికి మంచినీరు అందించి సపర్యలు చేశారు. అతను సేదదీరిన తర్వాత అతనికి తినడానికి తిండి ఇచ్చి అక్కడి నుంచి పంపించేశారు.

మెగా జాబ్ మేళాకు స్పందన



విద్యార్థులను ఇంటర్వ్యూ చేస్తున్న ఓ కంపెనీ ప్రతినిధులు

సీతంపేట: స్థానిక శంకరమఠం రోడ్డులోని డాటాప్రో కంప్యూటర్స్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. వివిధ రంగాలకు చెందిన సుమారు 20కు పైగా కంపెనీలు అభ్యర్థులను ఇంటర్వ్యూలు చేశాయి. మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్, టెక్ మహీంద్రా, కాన్సెంట్రిక్స్, డబ్ల్యూఎన్ఎస్, స్టడీ కనెక్ట్, ఫ్రూజెస్, క్వెస్, డిక్సన్, వరుణ్ మోటార్స్, హ్యుండయ్, మోబిస్, అపోలో ఫార్మసీ, డెక్కన్, డైకిన్, జోస్ట్ తదితర సంస్థలు పాల్గొన్నాయి. సుమారు రెండు వేల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సెంటర్ మేనేజర్ సునీల్ మాట్లాడుతూ 35 ఏళ్లుగా ప్రతి ఏటా సంస్థ వార్షికోత్సవం రోజున మెగా జాబ్‌మేళా నిర్వహించి, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంస్థ జనరల్ మేనేజర్ కిశోర్ వర్మ, డైరెక్టర్లు రంగినేని సాయిప్రసాద్, సిద్ధవరావు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భాగవతం హరికథ

మద్దిలపాలెం : కళాభారతి ఆడిటోరియంలో విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న హరికథ ఉత్సవాల్లో రెండో రోజు శనివారం 'దాన వీర శూర కర్ణ' హరికథను ప్రముఖ భాగవతార్ జేజీ నారాయణ చక్కటి హావభావాలతో రక్తి కట్టించి అందరి మన్ననలు పొందారు. ముందుగా వీఎండీఏ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి రాంబాబు, పప్పు హనుమంతరావు, పేరాల బాలమురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు.

రక్షక భటులకే.. రక్షణ కరువు



కూటమి ప్రజాప్రతినిధులు పోలీసులకు నిలువ నీడ లేకుండా చేస్తున్నారు. పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకోవడం కోసం ట్రాఫిక్ పోలీసులను ఎండలో నిలబడేలా చేస్తున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం బీచ్ రోడ్డులో తలసేమియా రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమం కోసం నోవాటెల్ ఎదురుగా ఉన్న ట్రాఫిక్ పోలీసుల పోస్టుకు భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. దీంతో ట్రాఫిక్ పోలీసులు ఎండలోనే విధులు నిర్వర్తించాల్సి వచ్చింది. పెద్దల ఆశీస్సుల కోసం పోలీసులను ఇబ్బందులకు గురి చేయడాన్ని ప్రజలు తప్పుబడుతున్నారు.

– ఫొటో సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం